Page No. 1 - Green Page No. 1 - Red Page No. 1 Black

ACCION FRATERNA
ecology centre
sustainable . human . nature

# ఎ.ఎఫ్. ఎకాలజీ సెంటర్, అనంతపురం.

ఈ మాసపు సమాచారం జూన్, 2011

FOR PRIVATE CIRCULATION ONLY

# పంటలు వేసే తరుణంలో సమగ్ర వ్యవసాయం విధానాన్ని గురించి మరొక్కసారి ఆలోచిద్దాం !

ఈ సంవత్సరం మే చివరి వారంలో జిల్లా అంతటా అదునులోనే పదునయింది. రైతులందరూ సేద్యాలు మొదలు పెట్టినారు. రైతులందరిదీ ఒకటే పరిస్థితే. విత్తనం కొనుగోలు, ఎరువుల కొనుగోలు, బాడుగలతో సేద్యం చేయించడం, మళ్లీ కొత్త అప్పులు. ప్రతి సంవత్సరం మే, జూన్ మాసాలు జిల్లాలోని రైతులందరిని చిన్న, పెద్ద తేడా లేకుండా ఆందోళనల్లో పడవేస్తాయి. ఇంత కష్టపడి విత్తనం వేయడం అయిందనిపించినా, ఆ తరువాత సమస్యలు యధావిధిగా ఉంటాయి. జిల్లాలోని వర్షాధార రైతులు ఈ సమస్యలను ఎన్నాళ్ళు భరిస్తూ ఉండాలి ? రైతులకు బరువవుతున్న ఈ పరిస్థితుల నుండి బయటపడడానికి రైతులా మనం ఆలోచించలేమా ?

ప్రకృతి మన పట్ల చూపిస్తున్న నిరాదరణను మనం పూర్తిగా మార్చలేం. కానీ మనం ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా చాలా వరకూ వ్యవసాయ సంక్షోభం నుంచి బయటపడవచ్చు. ఈ విధంగా ఆలోచించడానికి ముందుగా మనం ప్రకృతికి అనుకూలంగా వ్యవసాయ పద్ధతులను చేపట్టవలసి వుంటుంది. పూర్వం వ్యవసాయదారులైన మన పెద్దలు ఏ ప్రాంతానికి ఆ ప్రాంతం వాతావరణ పరిస్థితులకనుగుణంగా పంటలు పండించేవారు. ఇప్పుడంతా మారిపోయింది. వ్యవసాయంలోకి కూడా వ్యాపారం ప్రవేశించడంతో, వ్యాపారులకు అనుకూలంగా అందరూ ఒకే విధంగా పంటలు పెట్టే విధంగా మనల్ని ప్రభావితం చేశారు. గతంలో మన వాళ్ళు ఏ శాస్త్రవేత్తల సలహాలు తీసుకోలేదు. అయితే వ్యవసాయ ఆచరణ పద్ధతులన్నీ చాలా వరకూ శాస్త్రీయంగానే వున్నాయి.

## వేరుశెనగ పంట గురించి ఒక్కసారి

ఎంతకాదనుకున్నా, మనకు వేరుశెనగ పంటే ప్రధానమైన పంట. మన జిల్లా వాతావరణ పరిస్థితులు, వర్షాపాతం, పంట భీమా, తదితర కారణాలతో మనమందరం వేరుశెనగ పంట వైపు మళ్లక తప్పడంలేదు. 1993-2004 మధ్య పన్నెండు సంవత్సరాలలో పంట పండినది కేవలం 4 సంవత్సరాలేనని, మిగత ఎనిమిది సంవత్సరాలు కరువులకు, పంట నష్టాలకు గురయినట్లుగా వ్యవసాయ శాస్త్రవేత్తలు తేల్చారు. వర్షాపాతం పంటలు బాగున్న కాలంలో సగటున హెక్టారుకు 800-900 కిలోల పంట దిగుబడి రాగా, పంటలు తేలిపోయిన సంవత్సరాలలో హెక్టారుకు 300-400 కిలోల వేరుశెనగ పంట మాత్రమే వచ్చిందని కూడా శాస్త్రవేత్తలు తేల్చారు. పంట నష్టపరిహారాలు ఎన్ని వచ్చినా రైతులను ఆదుకో లేవు. గుడ్డిలో మెల్లగా ఊరటనిస్తాయి. ఈ దశలో వేరుశెనగ విత్తుకునే ముందుగా కొన్ని విషయాలను అవగాహన చేసుకుందాం. సాధారణంగా మనం వాడే TMV2 రకం కంటే కొత్త రకాల వంగడాలు అధిక దిగుబడినిస్తున్నాయని శాస్త్రవేత్తలు ధృవీకరిస్తున్నారు. ICGV 91114 (అనంత రకం) 90-95 రోజులలోనే కోతకు వస్తుంది. వర్షాభావానికి తట్టుకున్నట్లుగానూ, పంటదిగుబడి కూడా TMV2 కంటే అధికంగా వచ్చినట్లుగా పంట నష్టాల కాలంలోనే రుజువయింది. కాబట్టి సాధ్యమయినంత వరకూ అనంత, వేమన, కదిరి రకాలు వేయాలని విత్తనం దొరకని పరిస్థితుల్లోనే TMV2 కోసం ఆలోచించాల్సిందిగా ఈ సందర్భంగా విజ్ఞప్తి చేస్తున్నాను. వేరుశెనగ పంట విత్తుకునే ముందు రైతు సోదరులు మరొక ముఖ్య విషయాన్ని కూడా జ్ఞాపకం చేసుకోవాలి. గత సంవత్సరాలలో పంట నష్టాల కాలంలో సాదాగా వేరుశెనగ పంట వేసుకున్న వారికంటే, అంతర పంటలు వేసుకున్న వారికి తక్కువగా నష్టం జరిగింది. వేరుశెనగపంట నష్టమయినా, కందులు, ఆముదం, సద్ద, జొన్న, అలసంద, పెసర అంతర పంటలుగా అక్కిళ్ళు, సరిహద్దు పంటలుగా విత్తుకున్నవారికి వాటిలో ఆదాయమొచ్చింది. పైగా రకరకాల పంటలు కలిపి ఉండడంవల్ల ప్రధానమైన పంట వేరుశెనగకు కూడా ప్రకృతిపరంగా రక్షణ ఏర్పడుతుంది. సద్ద, జొన్న కంకులమీద పక్షులువాలి పురుగులను తినివేస్తాయి. అలసంద, ఆముదపు ఆకులమీద గొంగలిపురుగులు లాంటివి ఆశించకుండా ప్రధాన పంటకు రక్షణగా వుంటుంది. కనీసం ఇంటి వాడకానికి అవసరమైన పప్పుధాన్యాలు పండే సౌలభ్యం వుంది.

## పప్పుధాన్యాలు, ఆహార పంటల శాతం పెంచాలి.

సాధారణంగా వ్యవసాయంలో అనుభవమున్న ఏ రైతు కూడా పొలంలో ఒకే పంట వేయాలనుకోడు. 1960కి ముందు మనవాళ్ళు జిల్లా మొత్తం సాగు విస్తీర్ణంలో సగం వరకూ జొన్న, కొర్ర, సద్ద, రాగి పంటలను పండించేవారు. వేరుశెనగ 20 శాతం విస్తీర్ణంలో మాత్రమే పండించేవారు. రాను రానూ సాగులో వున్న ప్రతి అంగుళం భూమిలో కూడా వేరుశెనగ వేయాలనే తాపత్రయం ఎక్కువయింది. కారణాలు ఏమైనప్పటికీ రైతుకు నష్టం కలగకుండా పంటలు పండించాలన్నదే మన ప్రధాన ఉద్దేశ్యం. అక్కిళ్ళకు, ఇతర పంటలు అంతర పంటలు వేసుకొని చెనిగె పంటను తక్కువ చేసుకుంటే ఆదాయం తగ్గుతుంది కదా అని కొంతమంది మాట్లాడటం జరుగుతుంది. రైతు ఇంత స్థలంలో ఫలాన పంట వేస్తే ఇంత ఆదాయం వస్తుంది కదా అని కాగితపు లెక్కలు వేయడం మానివేయాలి. తన పొలంలో గడచిన సంవత్సరాలలో ఎంత పంట వచ్చింది ? ఎంత ఆదాయం వచ్చింది అని వాస్తవాల్ని ఆధారం చేసుకుని ఆలోచిస్తే అసలు విషయం బోధపడుతుంది. పంట వేస్తే, లారీలకు పండించాలన్న అభిప్రాయం నుండి బయటపడాలి. రైతు తన పొలాన్ని చిల్లర దుకాణంగా మార్చుకోవాలి. దుకాణాదారుడు ఏ విధంగా అయితే చిన్న, పెద్ద వస్తువులను అన్నింటినీ అమ్ముతాడో, అదే విధంగా రైతు కూడా చిన్న, పెద్ద పంట అనే తేడా లేకుండా సాధ్యమయినంత వరకూ మిశ్రమ పంటలు, అంతర పంటలుగా వేయాలి. అన్నింటికంటే ముఖ్య విషయం ఏమిటంటే, గడచిన 4-5 సంవత్సరాలలో మన జిల్లా పంటల దిగుబడులలో అంతర పంటలు, మిశ్రమ పంటలు రైతులకు ఆదాయాన్నే ఇచ్చినాయి. ఒకే పంటగా వేరుశెనగ వేసినవి మాత్రమే రైతుకు ఎక్కువగా నష్టం కలిగించినాయి. వేరుశెనగ కాకుండా, కొర్రలు, కందులు, సద్దలులాంటి పంటలు వేస్తే, రైతుకు ఖర్చులు కూడా బాగా తగ్గుతాయి. ఒక వేళ పంట పోయినా, నష్టం అధికంగా వుండదు. →

"భూమాత అపారమైన తన అడవుల్ని, వన్య ప్రాణుల్ని, నదుల్ని, సముద్రాల్ని కాపాడుకుంటున్నంత వరకూ మానవ సంతతి వర్ధిల్లుతూనే ఉంటుంది" ఉపనిషత్తులు

## చిరుధాన్యాల పంటల సాగుకు అధికంగా వర్షపాతం, సారవంతమైన భూములు అవసరము లేదు.

చిరుధాన్యాల పంటలను కేవలం తక్కువ వర్షాపాతం మీద ఆధారపడే పండించవచ్చు. ఆ పంటల కోసం రసాయనిక పురుగు మందులక్కరలేదు. దిగుబడి పెరగడానికి రసాయనిక ఎరువులు అక్కరలేదు. కేవలం, 15 సెం.మీ.లోతు వరకే చిరుధాన్య పంటల వేర్లు భూమిలోకి పోతాయి. కాబట్టి పెద్దగా లోతైన సారవంతమైన భూములు కూడా అవసరం లేదు. సాధారణ నేలల్లోనే ఈ పంటల్ని పండించవచ్చును. వర్షాపాతం కింద ఏ ఏ పంటలకు ఎంత వర్షాపాతం అవసరమో ఒకసారి గమనిద్దాం.

| | |
|---|---|
| చెరకు, అరటికి | 2000-2200 మి.మీ. |
| వరి | 1200-1300 మి.మీ. |
| మిరప | 600 మి.మీ. |
| పత్తి | 600-650 మి.మీ. |
| మొక్కజొన్న, వేరుశెనగ | 450-500 మి.మీ. |
| సద్దలు, జొన్నలు, కొర్రలు, సామలు, రాగులు | 350-400 మి.మీ. |
| పప్పుధాన్యాలు, నువ్వులు | 300-350 మి.మీ. |

మన జిల్లా వర్షాపాతం సగటు 520 మి.మీ. అంటే వర్షాపాతం తక్కువగా నమోదయిన సంవత్సరాల్లో కూడా జొన్న, సజ్జ, కొర్ర, సామ, కంది, అలసంద, అనుముల నుంచి నువ్వుల వరకూ పండించవచ్చునని అర్థమవుతున్నది. పంట మార్పిడి కూడా సులభంగా చేసుకొని, భూసారాన్ని కాపాడుకోవచ్చును. ఈ రోజున మనకున్నటువంటి ఒక ప్రతికూల ముఖ్య అంశమేమంటే, విచక్షణారహితంగా రసాయనిక ఎరువులు వాడుతూ, ఏక పంటలు పండించడంవలన భూములు నిస్సారంగా మారిపోయి వున్నాయి. సేంద్రీయ పద్ధతులను అనుసరించి ఆహార పంటలను పండిస్తూ, వాటిని తిరిగి యధా స్థితికి తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా మన ప్రయత్నాలు కొనసాగాలి. చిరుధాన్యాల పంటలకు మళ్ళితే, మళ్ళీ భూములు తిరిగి సాధారణ స్థాయికి వస్తాయి.

## చిరుధాన్యాలలో ఆహారపు పోషక విలువలు

గ్రామీణ ప్రాంతాలలో మెట్ట వ్యవసాయం ఎక్కువగా వున్న వర్షాభావ ప్రదేశాలలో ఇప్పటికీ చిరుధాన్యాలను మాత్రమే ఆహారంగా ఉపయోగిస్తున్నారని. మనందరికీ తెలుసు. రాగి ముద్దగానీ, జొన్న, సద్ద రొట్టెలుగానీ, సంగటి, కొర్రబువ్వగానీ తింటే, శరీరానికి పని చేయడానికి కావలసిన శక్తినిస్తుంది. అందులోకి అనుపానాలు తక్కువగా వున్నా జరిగిపోతుంది. ప్రజాపంపిణీ ద్వారా బియ్యాన్ని సరఫరా చేస్తుండడంతో గ్రామాలలో మన ఆహార అలవాట్లు కూడా మారినాయి. వరి బియ్యముతో ఆహారం, చిరుధాన్యాలతో ఆహారం తేడాల గురించి కొత్తగా చెప్పనక్కరలేదు. ఆ తేడాలేమిటో, పోషక విలువలు దేనిలో ఎంత వరకున్నాయో ఈ క్రింది పట్టిక ద్వారా తెలుసుకుందాం.

| ధాన్యం పేరు | ప్రోటీన్లు (గ్రా॥లో) | పీచుపదార్థం (గ్రా॥లో) | ఖనిజాలు (గ్రా॥లో) | ఇనుము (మి.గ్రా) | కాల్షియం (మి.గ్రా) |
|---|---|---|---|---|---|
| సద్దలు | 10.6 | 1.3 | 2.3 | 16.9 | 38 |
| రాగి | 7.3 | 3.6 | 2.7 | 3.9 | 344 |
| కొర్ర | 12.3 | 8 | 3.3 | 2.8 | 31 |
| వరిగె | 12.5 | 2.2 | 1.9 | 0.8 | 14 |
| అరికె | 8.3 | 9 | 2.6 | 0.5 | 27 |
| సామలు | 7.7 | 7.6 | 1.5 | 9.3 | 17 |
| బియ్యం | 6.8 | 0.2 | 0.6 | 0.7 | 10 |
| గోధుమ | 11.8 | 1.2 | 1.5 | 5.3 | 41 |

పై పట్టిక గమనిస్తే, బియ్యంకంటే, ఎంతో గొప్పవనుకుంటున్న గోధుమలకంటే చిరుధాన్యాలలోనే అన్ని రకాల పోషక విలువలు ఎక్కువగా ఉన్నాయి. అందుకే వీటిని మనం పౌష్టికాహారంగా పిలుస్తున్నాము. మరీ ముఖ్యంగా చిరు ధాన్యపు పంటలకు రసాయనిక ఎరువులు, రసాయనిక పురుగు మందులు వాడకపోవడంవల్ల, విష రసాయనాల అవశేషాలు ఇందులో వుండవు కనుక, ముఖ్యంగా స్త్రీలకు, పిల్లలకు, పెద్దవారికి బలవర్ధకాహారంతో పాటు శ్రేష్ఠమైనవి కూడా. అన్ని ధాన్యాలకంటే రాగులలో అధికంగా కాల్షియం పరిమాణం వుండడంవల్ల, ఎముకల పెరుగుదలకు, శరీరం నిర్మాణానికి ఎంతో ఉపయోగకరంగా వుంటుంది. బీటా కరోటిన్ అనే సూక్ష్మ పోషక పదార్థం బియ్యంలో కానీ, గోధుమల్లో గానీ దొరకదు. డాక్టర్లు వీటి కోసం క్యాప్సూల్స్, మాత్రలు రాస్తూ వుంటారు. అయితే ఈ సూక్ష్మపోషక పదార్థం చిరుధాన్యాలలో కావలసినంత లభ్యమవుతుంది.

## సేంద్రీయ వ్యవసాయ విధానంలో సమగ్ర వ్యవసాయ విధానమే శ్రీరామరక్ష

అతివృష్టికి, అనావృష్టికి తట్టుకొని రైతుకు నిలకడ గలిగిన ఆదాయాన్ని కలిగించేదే సమగ్ర వ్యవసాయ విధానం. ప్రతి రైతు కూడా రసాయనిక ఎరువులు, పురుగు మందుల జోలికి పోకుండా ప్రకృతి సిద్ధమైన వ్యవసాయ పద్ధతులనే పాటించాలి. ప్రతి రైతు తనకున్న పొలంలో కార్తెపంటలతో పాటు దీర్ఘకాలం ఆదాయాన్నిచ్చే మామిడి, చింత, సపోటా, సీతాఫలం లాంటి పండ్ల మొక్కలు నాటుకోవాలి. గత 7-8 సంవత్సరాల నుంచి ఎకాలజీ సెంటరు కార్యకర్తలు నచ్చచెప్పిన మీదట మామిడి, సపోటా మొక్కలు నాటుకున్న రైతులు ఇప్పుడు నమ్మకమైన ఆదాయం పొందుతున్నారు. సీతాఫలం మొక్కలు గట్ల6మీద చౌడునేలలో చెలికెల్లో ఎక్కడైనా నాటుకోవచ్చును. పైగా ఇప్పుడు సీతాఫలం కాయలకు మంచి రేటు దొరుకుతూవుంది. మొండి జాతి తొందరగా పంటకు వస్తాయి. సీతాఫలం మొక్కలు నాటుకోవాల్సిందిగా రైతులను ప్రత్యేకంగా కోరుతూవున్నాను. అవిశ, సుబాబుల్, వేప, తుమ్మ చిగిరి లాంటి మేతనిచ్చే చెట్లు, ఎరువుకు ఉపయోగపడే కానుగ, సీమ తంగేడు లాంటి మొక్కలు పొలంగట్ల మీద పెంచుకోవాలి. ఎంత ఎక్కువగా చెట్లు పెంచుకుంటే, వ్యవసాయానికి అంత ఆధరువుగా వుంటాయన్న సంగతి మర్చిపోరాదు.

ప్రతి రైతు, పంటలతో పాటు, గొర్రెలు, మేకలు, పాడి పశువులను పెంచుకోవాలి. వ్యవసాయానికి అదనపు ఆదాయం కొరకు ప్రణాళికలు వేసుకోవాలి. నీటి కుంటలకు అనువుగా ఉన్నచోట చేప పిల్లలను తెచ్చి వదులుకోవాలి. 4-5 ఎకరాలు ఉన్న రైతు గూడా పండ్ల చెట్లు, కార్తె పంటలలో అంతర పంటలు, వైవిధ్య పంటలు పండించడానికి సమాయత్తం కావాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ పద్ధతులు పాటిస్తే భూమాత మన మీద వాత్సల్యం చూపి పంట నష్టాలు లేకుండా కాపాడుతుంది.

అభినందనలతో...

మీ

**డా॥ వై.వి. మల్లారెడ్డి**

**డైరెక్టరు - ఏ.ఎఫ్. ఎకాలజీ సెంటరు.**

# బహుళ పంటలు, వైవిధ్య పంటలతో అధిక ఆదాయం పొందుతున్న రైతు

రైతు నమ్మకమైన ఆదాయం పొందడానికి, పంట నష్టాల పాలుకాకుండా వుండడానికి బహుళ పంటలు, వైవిధ్య పంటలే శ్రీరామరక్ష దీనినే సమగ్ర పంట విధానంగానూ, రైతు తనకున్న భూవసతిలో వర్షాధారం కిందనే ఏయే పంటలు ఎన్ని రకాల పంటలు పెడితే రైతుకు నమ్మకమైన ఆదాయం వస్తుందో ఇదే పత్రిక ద్వారా ఎకాలజీ సంస్థ డైరెక్టరు వై.వి.మల్లారెడ్డిగారు అనేక సందర్భాలలో వివరించారు. బహుళ పంటలు, వైవిధ్య పంటలతో తనకున్న రెండు ఎకరాల చిల్లర భూమిలోనే సంవత్సరానికి 7 నుంచి 8 లక్షల ఆదాయం పొందుతున్న రైతును గురించి హిందూ పత్రిక 12-5-2011న ప్రచురించారు. ఆ రైతు కూడా మనకు దూరంలో ఉన్న రైతేమీకాదు. మన జిల్లా వాతావరణానికి దగ్గరగా ఉంటున్న దొడ్డబళాపూర్ తాలూకాకు చెందిన తపసిహళ్ళి గ్రామానికి చెందిన సదానంద అనే రైతు. ఆ రైతు కథేమిటో మనమూ ఒకసారి చూద్దాం.

మొట్టమొదటగా సదానంద చెబుతున్న విషయమేమిటంటే వ్యవసాయంలో ఆదాయం పొందడం కష్టమేమీకాదు. ఉన్న సమస్యల్లా ఉన్న భూమిని సాంకేతిక పరిజ్ఞానాన్ని, వనరులను ఉపయోగించుకోవడంలోనే అసలు సమస్య దాగివుందంటున్నాడు రైతు సదానంద.

మొదట తనకున్న రెండు ఎకరాలలోనే కాయగూరలు పండించడం మొదలుపెట్టారు. ఆదాయానికి ఢోకా లేకపోయినా, కాయగూరలను అమ్ముకోవడాలు, మార్కెటింగ్ రవాణా సదుపాయాల్లోని సమస్యలు అతనికి సంతృప్తినివ్వలేదు. ఒకే రకమైన పంటల ఆదాయం మీద ఆధారపడే బదులు, వార్షిక పంటలు, సీజను పంటలు, నిత్య పంటలు, పశువుల పెంపకం కలిపి వ్యవసాయం కొనసాగించాలనుకున్నాడు. అందుకు తగిన విధంగా ప్రణాళికలు వేసుకున్నాడు. తనకున్న భూవిస్తీర్ణత తక్కువే కాబట్టి, పొలం సరిహద్దుల వెంబడి కొబ్బరి మొక్కలు నాటాడు. వాటితోపాటు, సపోటా, పనస చెట్లను కూడా కలిపి నాటాడు. (ఈ చెట్లు సంవత్సరమంతా కాపు కాస్తాయి) వీటితోపాటు పశువుల మేతకోసం అవిసె, మొక్కలు, ఆకు కోసం పొంగామియా, సిల్వర్ఓక్ మొక్కలు కూడా నాటాడు. 20 సెంట్ల విస్తీర్ణంలో వక్క చెట్లను నాటి, ఆకు అలములు, వ్యవసాయ వ్యర్థాలతో పాదులలో అచ్ఛాదన ఏర్పాటు చేసుకున్నాడు. దీనివలన తేమను, భూమిని కాపాడుకోవడం ఆయన ఉద్దేశ్యం.

2003-2004 వరకూ పంటల వైవిధ్యాల్ని తానే రూపొందించుకున్నాడు. గొర్రెలు, పాడి పశువులను కూడా అదనపు ఆదాయంగా ఏర్పాటు చేసుకున్నాడు. సంవత్సరంలో ఖర్చులు పోను రూ.3 లక్షలు ఆదాయం వచ్చిందని చెబుతున్నాడు సదానంద.

2005-2006 బెంగుళూరులోని వ్యవసాయ విశ్వవిద్యాలయానికి సంబంధించిన గ్రామీణ జీవనం కాంప్లెక్స్ ప్రాజెక్టు వారి సలహాతో కాయగూరల పంటల నుండి ఇతర పంటలకు మార్పు చేయడం జరిగింది. పూల పెంపకం, మొక్కల పెంపకం, అభివృద్ధి పర్చిన జాతి గొర్రెలను, వానపాముల పెంపకం, పెరటికోళ్ళ పెంపకం, అజోల్లా పెంపకాల్ని చేపట్టారు. వక్క చెట్ల కింద దడులు ఏర్పాటు చేసి గిరిరాజా కోళ్ళను పెంచడం మొదలుపెట్టాడు. 1 ఎకరా 20 సెంట్లలో రోజాపూల అంట్లను నాటాడు. స్థానిక అవసరాలను దృష్టిలో వుంచుకుని 10 సెంట్ల స్థలంలో కాయగూరల నారును పోసినాడు. రెండు జాతి ఆవుల ద్వారా సంవత్సరానికి ఆరు వేల లీటర్ల పాల ఉత్పత్తిని సాధిస్తున్నాడు. పొలానికి అవసరమైన నీటి నిల్వకోసం ఒక ఫారంపాండు ఏర్పాటు చేసుకుని అందులో చేప పిల్లలను తెచ్చి వదిలాడు. ఆవుల ద్వారా లభించే పేడ ఆధారంగా బయోగ్యాసు ప్లాంటును ఏర్పాటు చేసుకున్నాడు. నీటిని సమర్థవంతంగా ఉపయోగించుకోవడానికి డ్రిప్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. మనుషులు దొరకడం కష్టంగా వుందని తన పాత స్కూటర్‌ను పవర్ స్ప్రేయర్‌గా మలుచుకున్నాడు.

పొలాన్ని ఒక కిరాణా షాపుగా మార్చేయాలంటున్నాడు సదానంద. కిరణా షాపులో ఎన్నిరకాల వస్తువులు ఉంటాయో అదే విధంగా వివిధ రకాల పంటలను పండించాలని ఆయన అభిప్రాయం. ఒక పంట నష్టపోయినా, మిగతా పంటలు ఆదుకుంటాయని సదానంద అభిప్రాయపడుతున్నాడు. అందుకే సమగ్ర వ్యవసాయ పద్ధతులే రైతును నిలబెడతాయని సదానంద వ్యవసాయంవల్ల రుజువవుతోంది.

# సుస్థిర వ్యవసాయ పద్ధతులలో పళ్ళ తోటలతో పంట నష్టమంటే ఏమిటో తెలియని రైతు మంజునాథ

కుందుర్పి మండలం మాయదార్లపల్లి గ్రామానికి చెందిన రైతు మంజునాథ (45 సం॥) జిల్లాలో ప్రతి రైతు అనుభవించే పంట నష్టాలు, కరువుల్ని జయించినాడు. తొలకరి వర్షాలు వచ్చిన తరువాత పంటలు పెట్టడం, వర్షాలు రాకనో, తెగుళ్ళు వచ్చో, అసలు పంటలు పండకనో సంవత్సరమంతా ఆందోళనకు గురిచేస్తే మెట్ట వ్యవసాయం స్థానంలో వర్షాధార పళ్ళతోటల సాగు ద్వారా, సేంద్రీయ పద్ధతులతో పళ్ళతోటలు పెంచడంతో ఖర్చులు తగ్గించుకోవడమేకాదు, నాణ్యమైన పంటల దిగుబడిని కూడా పొందగలుగుతున్నాడు. చుట్టుపక్కల గ్రామాల రైతులందరికీ ఆదర్శప్రాయంగా గుర్తింపు పొందిన మంజునాథ విజయం వెనుకగల కారణాలేమిటో ఒకసారి మనం కూడా పరిశీలిద్దాం.

మంజునాథకు 262-4, 263-6 సర్వే నెంబర్లలో వారసత్వంగావచ్చిన 10 ఎకరాల 57 సెంట్ల మెట్టభూమి మాత్రమే వుంది. తనతోపాటు 7 మంది కుటుంబ సభ్యుల జీవనం, పిల్లల చదువులు వారి అవసరాలు అన్నీ పొలంద్వారానే తీరాలి. గతంలో కూడా రసాయనిక ఎరువుల జోలికి వెళ్ళకుండా పశువుల ఎరువు బండికి 80/- రూ॥ నుండి 100/- రూ. వరకూ కొని పొలానికి వేసేవాడు. అన్నీ రేట్లు పెరిగినట్లుగానే పశువుల ఎరువుకు కూడా రేట్లు పెరిగి రూ.600/- పైబడి వుండడంతో అది కూడా కష్టంగా మారింది.

ఈ దశలో మన సంస్థ వర్షాధారం కింద పళ్ళతోటలకు రైతులను ప్రోత్సహిస్తుండడంతో, నీటి వసతి లేకుండా పళ్ళ మొక్కల్ని పెంచడం సాధ్యం కాదని కొంతమంది పెదవి విరుస్తున్నప్పటికీ తాను సాహసం చేయాలనుకున్నాడు. వాటర్‌షెడ్డులో భాగంగా ప్రభుత్వం తరపున 130 మామిడి మొక్కలు ఇచ్చి, గుంతకు రూ.10/- వంతున ఆర్థిక సహాయం చేసినారు. 130 మొక్కలకు 130 గుంతలు తవ్వి, ఆ గుంతలలో పొలము చుట్టూ వున్న వేపాకు, జిల్లేడు, కానుగ ఆకులు కొట్టి గుంతలలో వేసి, వాటిమీద గుంతకు ఒక గంప ఇసుక వేయడం జరిగింది. ఆ తరువాత సగం గుంతవచ్చేంతవరకూ మన్ను కప్పి రెండు నెలల కాలంపాటు గుంతలు మగ్గేవరకూ పెట్టినాడు. ఆ తరువాత గుంతలలో మొక్కలునాటి, కొన్ని సంవత్సరాలపాటు ఊరిలోని బోరు నుంచి నీళ్ళు తెచ్చి పోసుకుని బతికించినారు. ఆ తరువాత ఎకాలజీ సెంటరు వారు కూడా మొక్కలు ఇచ్చి నీళ్ళు పోసుకుని బతికించుకోవడానికి సహాయపడినారు. మొత్తం 10 ఎకరాల 57 సెంట్లలో చెట్లు ఈ విధంగా వున్నాయి.

| రకం | కాపుకు వచ్చినవి | ఇంకా కాపుకు రానివి | మొత్తం |
|---|---|---|---|
| మామిడి తోతాపురి | 100 | 200 | 300 |
| మామిడి బేనీషా | 50 | - | 50 |
| సపోటా | - | 128 | 128 |
| పెద్ద పనస | - | 15 | 15 |
| సీతాఫలం | 100 | - | 100 |
| టేకు చెట్లు | - | 150 | 150 |

## వ్యవసాయ పద్ధతులు :

చెట్లకు కావలసిన ఎరువుల కోసం రసాయనిక ఎరువులు పురుగు మందుల జోలికే వెళ్ళకుండా ఎకాలజీ సంస్థ సిబ్బంది తెలియజేసిన పద్ధతుల్లో ఎరువులను స్వంతంగా తయారుచేసుకోవడం జరుగుతోంది. చుట్టుపక్కల దొరికే పచ్చి ఆకులు, పొలం గట్లల్లో దొరికే జిల్లేడు, కానుగ, తంగేడు ఆకును కొట్టి తెచ్చి NYM పద్ధతిలో నాడాఫ్ కంపోస్టు వేసుకుని దానికి నీళ్ళు వేసి మగ్గించి వర్మీ కంపోస్టు తొట్టెల ద్వారా వానపాముల ఎరువులు తయారు చేసుకుంటూ చెట్లకు వాడుతున్నాడు.

వర్మీకంపోస్టును చెట్లకు వాడడంవలన సాధారణంగా చెట్లకు వచ్చే శంఖు రోగం, బంక తెగులు, మచ్చ రోగం, బూడిద తెగులు వంటి రోగాలు రావడం లేదు. చెట్లకు పంచగవ్య, జీవామృతం కూడా వాడుతుండడంవలన ఎటువంటి తెగుళ్ళు రావడంలేదు. చెట్లు పూత దశలో పుల్లటిమజ్జిగ, లేత టెంకాయనీళ్ళు కలిపి, కుండలో వేసి మూడు రోజులు ఎరువు దిబ్బలో పూడ్చి పెట్టడం జరిగింది. 4వ రోజున చెట్లకు పిచికారి చేయడంవలన పూతరాలకం బాగా తగ్గింది. పూర్తిగా సేంద్రీయ ఎరువులు వాడుతున్నందున కాయ మంచి షైనింగ్ వచ్చింది. మంచి తీపుగా కూడా వుండడంతో మార్కెట్లో మంచి గిరాకి వచ్చింది.

2008-2009 ఎకాలజీ సెంటరువారు కుందుర్పిలో నిర్వహించిన పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రోత్సాహక బహుమతి ఇచ్చినారు. అదే విధంగా 2009-2010లో చెర్లోపల్లిలో నిర్వహించిన పర్యావరణ దినోత్సవంలో కూడా మరొకసారి ప్రోత్సాహక బహుమతినివ్వడం జరిగింది.

పూర్తిగా సేంద్రీయ పద్ధతులు పాటిస్తుండడంవలన గత నాలుగు సంవత్సరాలుగా చెట్లుకాపుకు వచ్చినప్పటి నుండి ఈ క్రింది విధంగా ఆదాయం వచ్చింది.

| | | |
|---|---|---|
| 2007-08 మొదటి సంవత్సరం 100 మామిడి, 128 సపోటా | - | 22,000/- |
| 2008-09 రెండవ సంవత్సరం 100 మామిడి, 128 సపోటా | - | 46,000/- |
| 2009-10 మూడవ సంవత్సరం 100 మామిడి, 128 సపోటా | - | 70,000/- |
| 2010-11 నాలుగవ సంవత్సరం 100 మామిడి, 128 సపోటా | - | 1,55,000/- |

ఎకాలజీ సిబ్బంది చెప్పినరీతిలో సేంద్రీయ పద్ధతులు పాటించడంవలన పంట ఖర్చులుకూడా బాగా తగ్గినాయి. ప్రతి చెట్టుకు తేమ ఆరిపోకుండా పాదుల్లో మగ్గిపోయిన వేరుశెనగ కట్టె పర్చి ఉంచడం వలన పాదులు తొందరగా ఎండకుండా వుంటున్నాయి. ప్రతి సంవత్సరం పంటల కోసం ఆందోళనలు, కరువులు, అప్పులతో సతమతమవుతున్న మంజునాథ నమ్మకమైన ఆదాయం పొందడానికి కారణమైన ఎకాలజీ సంస్థకు కృతజ్ఞుడుగా వుంటున్నానని అంటున్నాడు.

**ప్రచురణ:** డైరెక్టరు - ఎ.ఎఫ్. ఎకాలజీ సెంటర్, ఉప్పరపల్లి రోడ్డు, బెంగుళూరు హైవే, అనంతపురం - 515 002.
☎ (08554) - 244222 / 246884, ఫ్యాక్స్ : (08554) - 244990, E-mail : actionf@sancharnet.in / actionf_atp@dataone.in